వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు



తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న నాయకులు

నిజాంపేట్ : శ్రీనివాస నగర్ కాలనీలోని శ్రీనివాస అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ భూనీలా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం వివిధ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఫణి, సత్య ప్రసాద్, ప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, ఆది, సురేష్, బాలాజీ, రవి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట : డివిజన్ పరిధిలోని షిరిడీ హిల్స్‌లో శంకర్ నాయక్ జ్ఞాపకార్థం వారి కూతురు డాక్టర్ దివ్య రేఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించారు. 65 మంది పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో షిరిడీ హిల్స్ అధ్యక్షులు బండ మహేందర్, నర్సింగ్ నాయక్, శేషారెడ్డి, శోభ నాయక్, మిట్టల్, సౌమ్య దాస్, ప్రభాకర్, అనిల్ కుమార్, శివ కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



సుభాష్‌నగర్: శాంతియుత మార్గం కోసం రన్ ఫర్ జీసస్ ర్యాలీ చేపట్టడం అభినందనీయమని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం క్రైస్తవులు సూరారం కాలనీ నారాయణ హృదయాలయ హాస్పిటల్ నుంచి ఐడీపీఎల్ చౌరస్తా వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పాస్టర్స్, క్రైస్తవులు పాల్గొన్నారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

సుభాష్‌నగర్: మతిస్థిమితం లేని వృద్ధురాలు చెరువులో పడి మృతి చెందిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ బతుకమ్మ బండను ఆనుకొని ఉన్న చింతల్ చెరువులో ఆదివారం ఉదయం ఓ వృద్ధురాలి శవం తేలి ఉంది. స్థానికులు సూరారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. బతుకమ్మబండకు చెందిన మునిపాలి సత్తమ్మగా (81) గుర్తించారు. ఈ నెల 19 న తన ఇంటి నుంచి వెళ్లిన సత్తమ్మ తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. చెరువులో శవమై కనిపించడంతో కూతురు సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయానికి ఎలక్ట్రికల్ డ్రమ్ విరాళం



మోతీనగర్: మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లోని శివరామాంజనేయ ఆలయానికి కబీర్‌నగర్‌కు చెందిన రమేష్ ఎలక్ట్రికల్ డ్రమ్‌ను ఆదివారం అందజేశారు. హారతి సమయంలో, పవళింపు సేవలో ఎలక్ట్రికల్ డ్రమ్ము ఉపయోగపడుతుందని ఆలయ ప్రధాన సేవకుడు రమేష్ అయ్యంగార్ తెలిపారు. ఆలయానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరైనా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో అన్నదానం



మోతీనగర్: అన్ని దానాల కన్నా అన్నదానం మహాగొప్పదని మోతీనగర్ సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యుడు బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ మానసిక ప్రభుత్వ వైద్యశాలలో మోతీనగర్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజ సేవ కోసం కేటాయించాలని కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగానే యూనిఫాంలు..!

507 ప్రభుత్వ పాఠశాలల్లో 89,465 మంది విద్యార్థులు

మహిళా సంఘాలతో దుస్తులు కుట్టించేందుకు చర్యలు

జిల్లాకు చేరిన క్లాత్.. మే 20 వరకు ఒక జత రెడీకి కసరత్తు



సాక్షి,సిటీబ్యూరో: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికే విద్యార్థులకు నూతన ఏకరూప దుస్తులు అందించేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాకు వస్త్రం చేరుకోగా ఎంఈవోలు, ఏపీఎంల ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పంపిణీ చేస్తున్నారు. వారు విద్యార్థుల కొలతలు కూడా తీసుకున్నారు. మండల కేంద్రాల్లో నిర్దేశించిన మండల సమాఖ్య కేంద్రాల్లో కుట్టు పనులు మొదలయ్యాయి. ప్రతి విద్యార్థికీ కనీసం ఒక జత దుస్తులైనా మే 20 లోగా సిద్ధం చేయాలని సంఘాలకు అధికారులు లక్ష్యం విధించారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజు విద్యార్థులు నూతన దుస్తుల్లో హాజరయ్యేలా శ్రద్ధ తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

507 పాఠశాలలు.. 86,465 మంది విద్యార్థులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 86,465 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల కోసం వస్త్రం (క్లాత్)పంపించడంతో మండలాల వారీగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) చేరవేసింది. మొదటి విడతలో వచ్చిన క్లాత్‌ను స్వయం సహాయక సంఘాల మహిళలకు కుట్టేందుకు అప్పగించారు. మిగతా క్లాత్ వచ్చే లోగా ఈ దుస్తుల తయారీ పనులు పూర్తిచేయాలని సంబంధిత ,అధికారులు ఆదేశించారు. జిల్లాలోని 144 మహిళా సంఘాల్లోని 1,099 మంది మహిళా సభ్యులు దుస్తుల తయారీలో నిమగ్నమయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 8 నుంచి పదో తరగతి బాలురకు మాత్రమే ఇప్పటివరకు ఏకరూప దుస్తుల్లో ప్యాంట్లు అందిస్తున్నారు. అయితే విద్యాశాఖ తాజా నిర్ణయం

6,7 తరగతుల బాలురకు..

మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6, 7 తరగతుల బాలురకు కూడా నిక్కరు కాకుండా ప్యాంట్ అందించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత కాలంలో ఏడో తరగతి పిల్లలు నిక్కరు తొడగడం సరికాదని తల్లిదండ్రులు పేర్కొనడంతో పాటు నిక్కర్లు వద్దని చాలామంది విద్యార్థులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ తాజా నిర్ణయంతో విద్యార్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మానిటరింగ్ చేసేందుకు అధికారుల నియామకం

విద్యార్థుల యూనిఫాంలు సత్వరమే కుట్టేలా ఆయా సెంటర్లను మానిటరింగ్ చేసేందుకు ప్రభుత్వం డీపీఎం, ఏపీఎంలను నియమించింది. గతంలో దుస్తులు కుట్టే పనులను స్థానిక కాంట్రాక్టర్లకు అప్పగించటంతో పాఠశాలలు పునఃప్రారంభమై నాలుగైదు నెలలు గడిచే వరకు కూడా యూనిఫాంలు అందించే వారు కాదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ జాప్యానికి చెక్ పెట్టడంతో పాటు స్థానిక మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో దుస్తులు కుట్టే పనిని మహిళలకు అప్పగించడంపై మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బస్తీల అభివృద్ధి

• మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బస్తీలు అభివృద్ధి చెందుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ దేవభూమి నగర్‌లో రూ. 36 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని కాలనీ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ భవనం నిర్మాణానికి 7 సంవత్సరాల క్రితం తాను స్థలం ఇచ్చానని గుర్తు చేశారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు చౌదరిగారి బుచ్చిరెడ్డి, అధ్యక్షులు భిక్షపతి గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్, జనరల్ సెక్రటరీ రాజేష్, నారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పార్వతీశం, రజనీకాంత్, రామిరెడ్డి, నాగరాజు, నాయుడు, శ్రీనివాస్ రెడ్డి, రజనీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించాలి

• చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక వ్యక్తి కాదని శక్తి అని, ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తలుగా ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ హాజరయ్యారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సి.ఎల్. వెంకటరావు, డాక్టర్ రామ్ సింగ్ నాయక్, డాక్టర్ చంద్రశేఖర్, భరత్, డాక్టర్ జ్యోతి, అశోక్, రామరాజు, మణిభూషణ్, శ్రీనివాస్, సీతారామరాజు, వేణుగోపాల్ యాదవ్, అరుణ్‌కుమార్, నరసింహచారి, వసంత్ యాదవ్, శేషయ్య, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఆర్ఐటీఎంలో ఘనంగా వార్షిక వేడుకలు



విద్యార్థులకు ట్రోఫీని అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

దుండిగల్: ప్రముఖ వర్ధమాన గాయకుడు యశస్వి తన గాత్రంతో అలరించాడు. కళాశాలలో జరిగిన ఈవెంట్‌లో విద్యార్థులను ఉర్రూతలూగించాడు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కళాశాలల్లో ఎలిసియం 2క24 పేరిట వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. యశస్వి, రాగ్ బ్యాండ్ ఆలపించిన గీతాలతో ఆ ప్రాంతం సంగీతమయంగా మారింది. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల ట్రెజరర్ మమతారెడ్డి, చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లను శ్రేయారెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డా. పి శ్రీధర్, ప్రిన్సిపాల్ మురళి ప్రసాద్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. అర్జబ్ మాలిక్, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూమ్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ



కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: చిన్నారులు, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు వారికి ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని భూమ్స్ అకాడమీ నిర్వాహకులు, మాస్టర్ కృష్ణ తెలిపారు. మే 25 వరకు పలు విభాగాల్లో నామమాత్రపు ఫీజులతో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. భూమ్స్ అకాడమీ 20 సంవత్సరాలుగా కరాటే, స్కేటింగ్, మార్షల్ ఆర్ట్స్, వెపన్స్ ట్రైనింగ్ వంటి రంగాలలో అనేక మంది విద్యార్థులకు నైపుణ్యాన్ని అందిస్తుందన్నారు. ఆసక్తి గల వారు భూమ్స్ అకాడమీని సందర్శించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎన్టీఆర్ నగర్‌లో కాంగ్రెస్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు లయక్ ఆధ్వర్యంలో ఆదివారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లాల్ మహ్మద్, సంజీవరెడ్డి, మోయిన్, రెహనా బేగం, గఫర్, అంజద్, దండే రాజు, శ్రీనివాస్ గౌడ్, రాజ్ కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో వాస్తుపూజ

నిజాంపేట్ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధురా నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అష్టలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం వాస్తుపూజ ఆలయ ప్రధాన అర్చకులు మారుతిస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాజా మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ప్రణయ ధనరాజ్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రధాన ముఖద్వారాల వద్ద పూజను నిర్వహించి ప్రధాన ద్వారాలను ఏర్పాటు చేశారు.
కార్యక్రమంలో హేమంత్ రావు, లింగయ్య, రాంబాబు, మద్దయ్య, హన్మంత్‌రావు, రమేష్, కమల్‌కుమార్, ఎస్ శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

ప్రసాద్ సేవలు మరువలేనివి : సీపీఎం



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆల్విన్‌కాలనీ: పెన్షనర్ల సంఘం నాయకులు ఎల్.డీ. ప్రసాద్ శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య, సీపీఎం నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం హైదర్‌నగర్ శాఖ కార్యదర్శి శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రసాద్ హెచ్ఎంటీలో పని చేస్తున్న సమయంలో కార్మిక ఉద్యమంలో చురుగ్గా పని చేశారన్నారు. ఎల్.డి. ప్రసాద్ నేత్ర దానం చేయటం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డి.జి. నరసింహారావు, జిల్లా కార్యదర్శి పి. సత్యం, జనార్దన్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఆర్. వరప్రసాద్, సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్, బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య,పాల్గొన్నారు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



శామీర్‌పేట్: ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగింది. తూంకుంట మున్సిపాలిటీ శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయం ఎదురుగా ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి మెట్‌పల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. కాగా మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటాయని, ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సనత్‌నగర్: ఈజీ మనీ కోసం గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. ముంబాయికి చెందిన సునీల్‌కుమార్ శర్మ (36) నగరానికి వలస వచ్చాడు. క్యాటరింగ్ పనులు చేస్తూ రోజుకు రూ.500లు సంపాదించేవాడు. అయితే తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలంటే గంజాయిని విక్రయించాలనుకున్నాడు. ఆ మేరకు బీదర్ ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి సనత్‌నగర్, బాలానగర్ ప్రాంతాల్లో అవసరమైన వారికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఫతేనగర్ ప్రాంతంలో సికిందర్ మున్నా అన్సారీ అనే వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా సనత్‌నగర్ పోలీసులు దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులు వారి నుంచి 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సునీల్‌కుమార్ శర్మతో పాటు కొనుగోలు చేసిన సికిందర్‌మున్నా అన్సారీని కూడా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



తులసీ కుమార్

ఘట్‌కేసర్: బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట్ మండలం సోమారం గ్రామానికి చెందిన పెరుమాళ్ల తులసీ కుమార్ (19) అవుషాపూర్‌లో ఓ ప్రైవేట్ వసతి గృహంలో ఉంటూ స్థానిక విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా శనివారం సాయంత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వసతి గృహం నుంచి వెళ్లిపోయాడు. అతడికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థి తండ్రి ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి ఆర్థిక సమస్యలు, ప్రేమ తదితర కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కల్యాణం

సుభాష్‌నగర్: గాజులరామారంలో డివిజన్ శ్రీరామ్ నగర్ ఏ లో ఆదివారం రేణుక ఎల్లమ్మ, పోచమ్మల కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లాల్ మహ్మద్, దండే రాజు, మరలింగ, పవన్, శ్రీనివాస్‌గౌడ్, అన్వర్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన అధ్యాపకుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజు వివిధ వర్సిటీలలో జరిగిన సమ్మె వివరాలను టీజీయూసీటీఏ జేఏసీ నాయకులు వివరించారు. ఓయూ పాలన భవనం ప్రవేశ ద్వారం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలతో నిరసన తెలిపారు. ఐఐటీ బాసరలో కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు వారి కుటుంబ సభ్యులు, పిల్లలతో కలసి సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు డా.ధర్మతేజ, డా.పరుశురామ్, డా.వేల్పుల కుమార్, డా.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల దుర్వినియోగం.. వ్యక్తి అరెస్ట్



దుండిగల్: విద్యుత్ మీటర్లను దుర్వినియోగం చేస్తున్న ఓ వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి వివరాల ప్రకారం .. దుండిగల్‌లోని సర్వే నంబర్ 454, పల్లవి ఆశ్రమం సమీపంలోని ఓ గదిలో వేణుగోపాల్ అనే వ్యక్తి సుమారు 30 విద్యుత్ మీటర్లను అక్రమంగా నిల్వ ఉంచాడు. రెండు సంవత్సరాలుగా సదరు మీటర్లకు బిల్లులు సైతం చెల్లిస్తున్నాడు. ఎలాంటి ఇంటి నంబర్లు లేకుండా ప్రభుత్వ స్థలాలను వక్రమార్గంలో రెగ్యులరైజేషన్ చేసే విధంగా మీటర్లను నిల్వ చేసినట్లు గుర్తించారు. విద్యుత్ ఏఈ శ్రీ సాయి ఫిర్యాదు పోలీసులు ఆదివారం గదిలోని విద్యుత్ మీటర్లను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని అరెస్ట్ చేశారు. విద్యుత్ మీటర్లను మంజూరు చేసిన సిబ్బందిపై సైతం విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

అటకెక్కిన రిజర్వాయర్ల నిర్వహణ!

ఏపుగా కలుపు మొక్కలు | టాయిలెట్లు లేక ఇబ్బంది | దుర్గంధభరితంగా ఆవరణ

కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రిజర్వాయర్లు నేడు హీనంగా తయారవుతున్నాయి. రిజర్వాయర్లు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టిన సంస్థలు తూతూ మంత్రంగానే మెయింటనెన్స్ పనులు చేపడుతున్నాయి. అక్కడక్కడ మరమ్మతులు మిగిలిపోయిన పనులను మరలా జలమండలి విభాగం వారే చేపడుతున్నారు. టాయిలెట్లు కూడా లేకపోవడంతో ఆ ప్రాంతం దుర్గంధ భరితంగా మారాయి.



రిజర్వాయర్ చుట్టు ఏపుగా పెరిగిన కలుపుమొక్కలు

చింతల్: కూకట్‌పల్లి వాటర్ వర్క్స్ (డివిజన్–9) ఫతేనగర్ సెక్షన్ పరిధిలో స్థలభావం వల్ల కుత్బుల్లాపూర్‌లో ఆరు ఎంఎల్ రిజర్వాయర్‌ను షాపూర్ నగర్‌లోని పంప్ హౌస్ పక్కన నిర్మించారు. ఫతేనగర్‌లో ఉన్న పంపింగ్ కేంద్రానికి షాపూర్ నగర్ నుంచి నిరంతరం నీటిని తరలిస్తూ బస్తీలు, కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్ చుట్టుపక్కల గత నాలుగేళ్లుగా వివిధ కలుపు మొక్కలు పెరిగాయి. ఇవి రాబోయే రోజుల్లో రిజర్వాయర్ నాణ్యతను దెబ్బతీసేలా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి సంవత్సరం మొక్కలు తొలగించేందుకు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో సదర్ కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా చెట్ల కొమ్మలను తొలగించి చేతులు దులుపుకుంటున్నాడు. దీంతో చెట్ల కొమ్మల రూపంలో కూడా అధికారులకు, కాంట్రాక్టర్లకు మధ్య ఒప్పందం కుదిరిందని వాటర్ వర్క్స్ కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. మొక్కలు తొలగించేందుకు నిధులు వెచ్చిస్తున్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా కొమ్మలు తొలగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్యాంకర్లు వచ్చిపోతుంటాయి. వీరందరికీ ఏదో ఒక సమయంలో తప్పనిసరిగా టాయిలెట్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. షాపూర్ నగర్ రిజర్వాయర్ ఆవరణలో టాయిలెట్లు లేక ఈ విభాగాల్లో పనిచేసే సిబ్బంది రిజర్వాయర్ల చుట్టే తమ పనులను చక్కబెట్టేస్తున్నారు. దీంతో రిజర్వాయర్ల చుట్టూ తీవ్ర దుర్గంధం నెలకొంది. జలమండలి అధికారులు స్పందించి షాపూర్ నగర్ రిజర్వాయర్ ఆవరణలో టాయిలెట్లను నిర్మిస్తే అక్కడ పనిచేసే సిబ్బందికి ఇబ్బంది లేకుండా ఉంటుందని సిబ్బంది పేర్కొంటున్నారు.



దుర్గంధ ప్రాంతం